అతివల చెంతకు బతుకమ్మ కానుక

ఆడపడుచులకు చీరలు, యువత కోసం క్రీడా కిట్ల పంపిణీ

తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన బతుకమ్మ చీరలు, క్రీడా కిట్లను బుధవారం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణలో నిర్వహించే బతుకమ్మ పండగను ఘనంగా నిర్వహించుకోవాలని ప్రతీ ఆడపడుచుకు చీరలు, గ్రామీణ ప్రాంతాల్లో యువతలో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకు క్రీడా కిట్లను అందించినట్లు తెలిపారు. – ఖమ్మంరూరల్/కూసుమంచి/నేలకొండపల్లి



కూసుమంచి: క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్



ఖమ్మంరూరల్: బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బెల్లం ఉమ



నేలకొండపల్లి: బతుకమ్మ చీర అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

క్లుప్తంగా

కమిషనర్‌ను అభినందించిన మంత్రి

'మ్యాన్ ఆఫ్ ది పార్క్'గా అభివర్ణన



కమిషనర్‌ను అభినందిస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరాభివృద్ధిలో భాగంగా అన్ని ప్రాంతాల్లో అద్భుతమైన పార్కుల నిర్మాణం కోసం ప్రత్యేక కృషి చేసిన మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభిని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అభినందించారు. నగరంలో బుధవారం జరిగిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలకు మంత్రితో పాటు కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ ఆయనను అభినందిస్తూ 'మ్యాన్ ఆఫ్ ద పార్క్స్'గా అభివర్ణించారు. నగరంలోని పలు డివిజన్లలో పార్కులను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు శ్రమించారని కొనియాడారు.

సెల్‌ఫోన్ అప్పగింత..

కూసుమంచి: మండలంలోని వాల్యాతండాకు చెందిన బానోత్ వెంకటేశ్ ఆరు నెలల క్రితం పాలేరులోని సంతకు వెళ్లగా అక్కడ అతని సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్‌లో మొబైల్ వివరాలను నమోదు చేశారు. ఫలితంగా బుధవారం అట్టి మొబైల్‌ను గుర్తించి స్వాధీనం చేసుకొని బాధితుడికి ఎస్సై రమేష్‌కుమార్ అందజేశారు. రూ.30 వేల విలువైన తన ఫోన్‌ను అప్పగించిన పోలీసులకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపాడు.

అంగన్‌వాడీల అరెస్ట్

కామేపల్లి: కామేపల్లి ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ ఉద్యోగులు బుధవారం సీపీఎం సీఐటీయూ ఆధ్వర్యాన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా.. కామేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు దుగ్గి కృష్ణ మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే వరకూ పోరాటం చేస్తామని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో సీఐటీయూ నాయకులు శాంతయ్య, ఉద్యోగులు ప్రమీల, నిర్మల, వసంత, జ్ఞానమ్మ, చిలకమ్మ, చంద్రకళ, కౌసల్య, కమలమ్మ తదితరులను ఉన్నారు.

చెడు మార్గాల వైపు పయనించొద్దు

నేలకొండపల్లి: యువత చెడు మార్గాల వైపు పయనించకుండా మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని నేలకొండపల్లి ఏఎస్ఐ కోట కోడేశ్రాము సూచించారు. మండల కేంద్రంలో బుధవారం విద్యార్థులు, యువతకు అవగాహన సదస్సు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ గురించి తెలుసుకోవాలని, గ్రామాలలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను నివారించేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు హరి, శివ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని డీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యాన మెంటర్ షిప్ ప్రోగ్రాంపై అవగాహన కల్పించినట్లు కళాశాల కరస్పాండెంట్ మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ శోభారెడ్డిలు తెలిపారు. అంతేకాక విద్యార్థులకు ఇండస్ట్రీ నుంచి వర్కింగ్ ప్రొఫెషనల్స్‌తో అనుసంధానం కల్పించి వారి నుంచి విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించడంపై సూచనలు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా టాస్క్ బాధ్యులు సంతోష్‌గౌడ్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఏఓ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రెజొనెన్స్'లో జంతు సంరక్షణ దినోత్సవం



వివిధ వేషధారణలతో ఉన్న చిన్నారులతో స్కూల్ డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ స్కూల్‌లో ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణిలు మాట్లాడుతూ..విద్యార్థులకు జంతువుల సంరక్షణ పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పాటు జీవ కారుణ్య భావనను వారిలో పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 'అడవులను రక్షించండి జంతువులను కాపాడండి' అంటూ వివిధ జంతువుల వేషధారణలో వచ్చిన చిన్నారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.ప్రసన్నరావు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె విజయవంతం



ఖమ్మంగాంధీచౌక్: సమ్మె చేస్తున్న డాక్ సేవక్స్, తపాలా ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్/నేలకొండపల్లి: పలు సమస్యల పరిష్కారం కోసం ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ సంయుక్త ఆధ్వర్యాన బుధవారం అయా బ్రాంచ్ పోస్టుమాస్టర్లు, గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మె చేపట్టారు. ఎనిమిది గంటల పని, పెన్షన్లతో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని, అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గ్రూపు ఇన్సూరెన్స్, గ్రాట్యూటీ రూ.5 లక్షల చొప్పున పెంచాలని, పని భారం తగ్గించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు విధులు బహిష్కరించి ఒక్కరోజు సమ్మె నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని తపాలా కార్యాలయాల్లో నిర్వహించిన సమ్మె కార్యక్రమాల్లో జీడీఎస్‌పీ జేసీఏ తెలంగాణ సర్కిల్ చైర్మన్ కోటేశ్వరరావు పాల్గొనగా.. సమ్మెకు ఖమ్మం డివిజన్ నుంచి తపాలా డివిజన్ జేసీఏ చైర్మన్ రాంప్రసాద్, కన్వీనర్ మౌలాలి, మత్తె వెంకటేశ్వరరావు, శ్రీరాములు, వి శ్రీనివాసరావు, పట్టాభి, సతీష్ తదితరులు నాయకత్వం వహించారు. అలాగే నేలకొండపల్లి సమ్మెలో సంఘం జిల్లా నాయకుడు కణతాల గోవిందరావుతో పాటు బీపీఎంలు, తపాలా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



సమ్మెలో మాట్లాడుతున్న బెల్లం శ్రీనివాస్

తిరుమలాయపాలెం: గత ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం తిరుమలాయపాలెంలో సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లకు సంఘీభావం ప్రకటించిన సందర్భంగా ఆయనమాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెంచిన వేతనాలను చెల్లించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ తరఫున సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వీరన్న, మధ్యాహ్న భోజన వర్కర్లు పాల్గొన్నారు.

తుది ఓటర్ జాబితా విడుదల

తిరుమలాయపాలెం: మండలంలోని 64 పోలింగ్ బూత్‌ల పరిధిలో తుది ఓటర్ జాబితాను బుధవారం మండల తహసీల్దార్ రామ్‌ప్రసాద్ విడుదల చేశారు. మండల ఓటర్లు మొత్తం 49,048 మంది కాగా వీరిలో పురుషులు 23,963 మంది, స్త్రీలు 25,085 మంది ఓటర్లుగా ఉన్నారు. ఓటర్ల జాబితాను మండల కేంద్రంలో సిద్ధంగా ఉంచినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావు, లక్ష్మణ్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మం అర్బన్: నగరంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ ఏఈ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలకుఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం లీగల్: తాళ్లూరి సాహస్ చౌదరి (బంటి) మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించే అంతర్ జిల్లా క్రికెట్ పోటీల వాల్ పోస్టర్లను బుధవారం కోర్టు ఆవరణలో ఆవిష్కరించారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించే ఈ పోటీలు డే అండ్ నైట్ జరుగుతాయని, వసతి సదుపాయం కూడా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు, న్యాయవాది తాళ్లూరి దిలీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, క్రీడల కార్యదర్శి రావుల వెంకట్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కస్తూర్బా విద్యార్థులు



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

కూసుమంచి: జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని కస్తూర్బా విద్యార్థులు ఎంపికయ్యారు. నాయకన్‌గూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి అండర్–17 కబడ్డీ పోటీల్లో విద్యార్థులు తమ సత్తాచాటి ప్రథమ బహుమతి సాధించారు. విజేతలను ఎస్‌ఓ అజితకుమారి, పీఈటీ నందినీ, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు తప్పవు

నేలకొండపల్లి: దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు తప్పవని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ట్రాన్స్‌కో ఏఈ, ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, కే.వీ.రెడ్డి, పి.సత్యనారాయణ, సాగర్, పగిడికత్తుల నాగేశ్వరరావు, స్టాలిన్, కూరపాటి ప్రసాద్, పెద్దపాక భాస్కర్‌రావు, తోళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో పడకలు పెంచాలని ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రోగులకు సరిపడా పడకలు పెంచడంతో పాటు సరైన సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ నాయకులు ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి, సౌకర్యాలు పరిశీలించి, రోగుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ.. డెంగీ వంటి విష జ్వరాలతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని, బెడ్‌లు లేక రోజులు కింద పడుకునే పరిస్థితి ఉందన్నారు. తద్వారా బాధితులకు సరైన వైద్యం అందలేకపోతుందని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆస్పత్రి అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, బోడ వీరన్న, ఎస్‌కె.చాంద్ పాషా, భూక్యా రవీందర్, డి.సురేష్, లింగయ్య, జాల నరసింహారావు, రవి, రహమాన్, జానీ, ఖాదర్, కరీం తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట సీపీఐ నాయకుల ధర్నా

బీటీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



రాజారాంపేటలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని పలు రహదారి నిర్మాణాలకు బుధవారం పాలేరు శాసనసభ్యుడు కందాళ ఉపేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రాయగూడెం–మంగాపురంతండా వరకు రూ.2.22 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, రాజారాంపేట నుంచి బుద్ధారం వరకు రూ.85లక్షలతో నిర్మించనున్న బీటీ రహదారికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీరోలులో వన్యప్రాణుల వారోత్సవాలు

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలు జెడ్పీ పాఠశాలలో వన్యప్రాణుల వారోత్సవాలను పురస్కరించుకొని అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వన్యప్రాణుల ప్రాముఖ్యత, వాటి సంరక్షణ అంశాలపై డ్రాయింగ్, వ్యాసరచన, రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం కూసుమంచి రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడగా.. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి.సురేష్‌కుమార్, సర్పంచ్ అలివేలమ్మ, ఎంపీటీసీ ఏనుగుల మాలతి శ్రీధర్, హెచ్‌ఎం రవి, తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: సమ్మక్క–సారక్క గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయ ఏర్పాటు కోసం రూ.900 కోట్లు ప్రకటించిన దేశ ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతగా ఎస్టీ మోర్చా ఆధ్వర్యాన బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవిరాథోడ్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గిరిజనుల కల సాకారం చేసినందుకు మోదీకి గిరిజనుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్, ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి మోహన్, భద్రం, సురేష్, బాలాజీ, హరీష్, విద్యాసాగర్, విష్ణువర్ధన్‌రెడ్డి, సరస్వతి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మృతులకు తమ్మినేని నివాళి

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, దళ కమాండర్ స్వర్గీయ మద్ది సింగిరెడ్డి సతీమణి అనసూర్య (82) అనారోగ్యంతో బుధవారం మృతిచెందగా సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కామంచికల్‌లో ఇటీవల మృతిచెందిన ప్రతాపనేని కృష్ణయ్య పెద్దఖర్మలో పాల్గొన్న నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్, సంద్ర ప్రసాద్, మేరుగు సత్యనారాయణ, ఎర్రా శ్రీను, ప్రసాద్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రఘునాథపాలెం: తెగుళ్లతో నష్టపోయిన మిర్చి రైతులకు ఎకరానికి రూ.లక్ష అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని రాంక్యాతండాలో మిర్చి తోటలను ఏఐపీకేఎస్ జిల్లా ప్రతినిధి బృందం పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన మిర్చి తోటలకు వైరస్ సోకకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. ఫసల్ భీమా యోజన పథకాన్ని ప్రభుత్వం చెల్లించే వాటా తగ్గించిందనే నెపంతో రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అమలు చేయకపోగా ప్రత్యామ్నాయంగా ప్రత్యేక బీమా పథకాన్ని ప్రవేశపెట్టలేదని ఆరోపించారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐపీకేఎస్ నాయకులు కేళోత్ లక్ష్మణ్, ధరావతు లక్ష్మణ్ జాటోత్ ప్రేమ్‌సింగ్, ఇస్లావత్ రమేశ్, కేళోత్ జార్జి తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న ప్రతినిధి బృందం

ముస్లిం డిక్లరేషన్ కరపత్రాలు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో దగాపడ్డ ముస్లింల హక్కుల సాధనకై తెలంగాణ రాష్ట్ర ముస్లిం డిక్లరేషన్–2023 కరపత్రాలను బుధవారం ఖమ్మంలోఆవిష్కరించారు. తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్ జేఏసీ ఖమ్మం జిల్లా కన్వీనర్ అబ్దుల్ రెహమాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు జేఏసీ జిల్లా గౌరవ సలహాదారుడు ఖిజార్ మాట్లాడుతూ.. ముస్లింలకు జనాభా ప్రాతిపదికన సరియైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ప్రధాన రాజకీయ పార్టీలకు కోరారు. ముస్లింలకు నామినేటెడ్ పోస్టులలో ప్రాతినిధ్యం కల్పించాలని, వక్ఫ్‌బోర్డు స్థలాల్లో గురుకులాల బిల్డింగ్‌లు నిర్మించాలని, ప్రతి పేద ముస్లిం కుటుంబానికి ఉపాధి కోసం రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించాలని, ముస్లింల రిజర్వేషన్ 12 శాతానికి పెంచాలని, పెండింగ్‌లో ఉన్న ఇమామ్, మౌజన్ల దరఖాస్తులను పరిష్కరించాలని, ఖబర్‌స్థాన్‌ల కోసం భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతిరావు పూలే ఐడియాలజీ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్, యూనిటీ ఆఫ్ మాల జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భద్రూ నాయక్, డాక్టర్ సమీ, ఇర్ఫాన్, మట్టి ప్రసాద్, నరేంద్ర, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

ఐక్య కార్యాచరణతో ఇళ్ల స్థలాలు సాధించుకోవాలి



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఐక్య కార్యాచరణతో జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు సాధించుకుందామని జర్నలిస్టు సంఘాలు, వివిధ రాజకీయ పక్షాల నేతలు, జర్నలిస్టులు పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. జర్నలిస్టులకు ఉచితంగా లేదంటే అతి స్వల్ప ధరకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఈ విషయాన్ని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ వీ.పీ. గౌతమ్‌లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. ఖమ్మం సభలో సీఎం కేసీఆర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్నా హామీని చిత్తశుద్ధితో నిరూపించుకోవాలని పేర్కొన్నారు. కేసీఆర్ హౌసింగ్ సొసైటీ బాధ్యులు ఇళ్ల స్థలాల ప్రక్రియ చివరి దశలో ఉందని, సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నేతలు, జర్నలిస్టుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'ప్రియదర్శిని'లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత కోసం ఐసీటీ అకాడమీ వారిచే ఏర్పాటు చేయబడిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ యూఐపాత్ రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఐసీటీ అకాడమీ రిలేషన్‌షిప్ మేనేజర్ షేక్.గౌస్‌పాషా మాట్లాడుతూ.. ఐసీటీ ద్వారా ఫ్యాకల్టీ, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక, యువత సాధికారత, డిజిటల్ సాధికారతలపై అవగాహన కల్పించడంతో పాటు ఉద్యోగం సాధించడానికి మెళకువలు నేర్పిస్తున్నట్లు తెలిపారు.కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్

ఖమ్మం సహకారనగర్: ఇటీవల వరంగల్‌లో జరిగిన శాస్త్రీయ నృత్య పోటీల్లో తమ విద్యార్థిని ప్రతిభ కనబర్చినట్లు న్యూ టైనిటాట్స్ హైస్కూల్ కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థిని భువనచంద్రికను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు..



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాలని చూస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, కమర్తపు మురళి, షేక్ మక్బూల్ అన్నారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌తో కలిసి బుధవారం వారు మాట్లాడారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నేతృత్వాన దాదాపు 2వేల మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేశారని, లబ్ధిదారుల సమక్షాన వీడియో చిత్రీకరణ నడుమ లాటరీల తీశాకే ఎంపిక చేసినట్లు చెప్పారు. కానీ కాంగ్రెస్ నాయకులు వైఎస్ఆర్.నగర్‌లో ఆందోళన చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూసే వారు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా ఖమ్మం ఎమ్మెల్యేగా అజయ్‌కుమార్ మూడోసారి గెలుపొందడం ఖాయమని వారు స్పష్టం చేశారు.

పారదర్శకంగానే 'డబుల్' ఇళ్ల కేటాయింపు

ఖమ్మం అర్బన్: నగరంలోని 8వ డివిజన్ వైఎస్సార్ కాలనీలో గల కేసీఆర్ డిగ్నిటీ డబుల్ బెడ్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులలో ఎటువంటి రాజకీయ జోక్యం లేదని, నిబంధనల ప్రకారమే అధికారులు పారదర్శకంగా నిర్వహించారని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు భూక్యా అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8వ డివిజన్ ప్రతిపక్ష కార్పొరేటర్ సొంత బంధువులకు ఇలు కేటాయించిన విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలి

రఘునాథపాలెం: సంక్షేమ పథకాలు పేదలకు మంజూరు కావడం లేదని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రఘునాథపాలెంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యాన పార్టీ మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ.. భూములు, ఇళ్లు ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలకే గృహలక్ష్మి, దళిత బంధు పథకాలు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ పథకాలను రీసర్వే చేయించి అర్హులైన పేదలకు పథకం వర్తించేలా చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్‌తో పాటు కేళోత్ లక్ష్మణ్, తక్కెళ్లపాటి భద్రయ్య, అయితగాని శ్రీనివాసరావు, ప్రవంత్, సర్పంచ్ కేలోతు దేవ్‌సింగ్, ఎంపీటీసీ యారగర్ల హన్మంతరావు, బాలాజీ నాయక్, మారం కరుణాకర్‌రెడ్డి, తమ్మినేని నాగేశ్వరరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి